# వెలితి

'ఇది బేగంపేట విమానాశ్రయమా లేక బేగంబజారు ఫిష్ మార్కెట్టా?' శారద చెయ్యి గుండెల మీదికెళ్ళింది.

ముప్పయేళ్ళ క్రితం మెడలో మూడు ముళ్ళేసిన రమేష్‌నూ, అల్లారు ముద్దుగా పెరిగి అమెరికాలో అడ్వాన్స్‌డ్ స్టడీస్ పూర్తి చేసుకొని వస్తున్న ముద్దుల కొడుకు నాగరాజునూ, వాషింగ్టన్ ఫ్లైట్ నుండి రిసీవ్ చేసుకునేందుకు వచ్చిన శారద-కారులోంచి దిగుతూ, కళ్ళజోడు సవరించుకుంటూ గొణుక్కుంది.

దోరగా మాగి ముడతలు బారిన బంగెనపల్లి మామిడి పండులాంటి మొహం నుదుటి అనుభవరేఖల మధ్య అర్ధరూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు, సరికొత్త డిజైన్ కంచి పట్టుచీర చలికాలం నీరెండలో తళతళ మెరుస్తున్నాయి. 'ఇంతమంది జనాలెందు కున్నారిక్కడ? మీ నాన్నను, అన్నయ్యను రిసీవ్ చేసుకునేందుకేనా?' పక్క డోరులోంచి కారుదిగుతున్న కూతురు శ్రీవాణి నడిగింది.

'ఏమోనమ్మా!' శ్రీవాణి కనురెప్పలు చిద్విలాసంగా ఎగిరి పడినై. ఎమ్మే చదివించిన కాటుక కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా కొట్టుకున్నాయి. 'ఇండియాలో ఎంబిఏ పాసై అమెరికాలో అడ్వాన్స్‌లో స్టడీస్ పూర్తి చేసుకుని తిరిగిస్తున్న అన్నయ్యకు వ్యాపార బాధ్యతలన్నీ అప్పగించి విశ్రాంతి తీసుకుంటా నన్నాడు. గదా నాన్న! పైగా స్వయంగా వెంటబెట్టుకొస్తున్నాడాయె. అందుకేనేమో ఇంతమంది అభిమానులు" ఎత్తయిన గుండెల్ని మునివేళ్ళతో తడుముకుంది.

'కాదమ్మా!' అసలు విషయం ఆరాతీసిన డ్రైవర్ కల్పించుకున్నాడు. 'ఆయనెవరో ఫౌజీ ఆఫీసరు... మేజర్ చంద్రశేఖరట.. మిల్టీ నుంచి రిటైరై ఢిల్లీ విమానంలో వస్తున్నా రంటా! వీళ్ళంతా ఆయనకు స్వాగతం చెప్పేందుకటా.'

'ఓహో! చంద్రశేఖరా! మేజర్ చంద్రశేఖరా!" శారద ఛాతీ గర్వంగా ఉబికొచ్చింది. ఆయన రెండు యుద్ధాల్లో పాల్గొని అజేయుడనిపించు కున్నాడు వాణీ...' ఇంకేదో చెప్పబోయింది.

'తెలుసమ్మా! పత్రికల్లో చదివాం గదా! యుద్దాల వ్యూహ రచనల్లో ఉత్తముడనీ, వీరోచితంగా పోరాడి దేశ గౌరవాన్ని, తెలుగుతేజాన్ని ప్రపంచానికి చాటాడనీ అతని గురించి రోజూ పత్రికల్లో ప్రత్యేక వ్యాసాలొచ్చాయి. గదమ్మా....' హంసలా అడుగువేస్తూ వయ్యారంగా తల్లి వెంట నడుస్తూంది. శ్రీవాణి.

అటూ ఇటూ చూస్తూ వెయిటింగ్ రూంలో కూచున్నారు.

అటు పక్క... నలుగురు నాగరికులు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ చేతుల్లో రంగురంగుల పూలదండలున్నాయి. ఒంటిమీద ఖరీదైన డ్రెస్సులున్నాయి.

'కోటీశ్వరుడు రమేష్.. కొడుక్కు ఈరోజే బాధ్యత అప్పగిస్తాడా?"

'పెరుగుతున్న వయసు, తరుగుతున్న ఓపిక... అప్పగించకేం జేస్తాడులే!'

'పట్టుబట్టి అమెరికాలో చదివొచ్చిన చెట్టంత కొడుకును ఉట్టిగా ఉంచడుగదా!'

"అబ్బే! ఆయన ఎవర్నీ ఖాళీగా ఉండనివ్వడు. కొడుక్కు బాధ్యత అప్పగించి అధికారాలన్నీ ఆయన గుప్పిట్లోనే ఉంచుకుంటాడు".

'వాళ్ళెట్లా ఏడిస్తే మనకేంగానీ, ఆళ్ళు ప్రారంభించబోయే కొత్త కంపెనీ ప్రొడక్ట్స్ ఏజెన్సీ మన ఏరియాల్లో మనకిస్తే చాలుగదా!"

'అది నిజమేగానీ... దానికి చాలా కాంపిటీషనుంది గదా!"

'ఆ కాంపిటీషన్లో మన పేరు ముందుండాలనే గదా మనమిలా ముందు జాగ్రత్త చర్యగా.. స్వాగత సత్కారాలకు ముందుకొచ్చింది."

'ఈ రోజుల్లో మస్కా కొట్టడం రానోడు కోన్‌కిష్కాగాడై పోతాడుగదా!'

'అవునవును. లేకపోతే ఆ తండ్రీ కొడుకులేమన్నా దేశోద్ధారకులా, దానకర్ణులా?"

'కరెక్ట్ చెప్పినవన్నా! పైసంటే రమేష్‌కు ప్రాణం. కొడుకును గూడా గట్లనే తయారుచేస్తున్నడు."

'ఆ తండ్రీ కొడుకుల నిప్పట్నుంచే కాకాపడితే రేపటికి మనకే లాభం రమేష్ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఇంకెన్ని కొత్త కంపెనీలొస్తాయో!'

'యావండోయ్! అటు చూడండి, అక్కడున్నది రమేష్‌గారి శ్రీమతి, కూతురు గదా!'

శారద, శ్రీవాణిల చూపులు అటు కిటికీ వైపున్నా చెవులు ఇటే వింటున్నాయి.

ప్రశాంత సముద్రములాగున్న శారద మనసులో అలల ఆటుపోట్లు చోటు చేసుకుంటున్నాయి.

ఢిల్లీ నుండి విమానమొచ్చిందనే ప్రకటన తియ్యని గొంతు ద్వారా వెలువడింది.

ఢిల్లీ విమానంలోంచి... మేజర్ చంద్రశేఖర్ దిగి వస్తున్నాడు. అతని భార్య భవాని నవ్వుతూ ఎదురెళ్ళి మెడల్లో పూలమాల వేసింది. భార్య చేతిలో చెయ్యేసి నడిపించుకొస్తున్నాడు. చంద్రశేఖర్.

పట్టరాని ఉత్సాహంతో పదిమంది యువకులు ఎదురెళ్ళారు.

'మేజర్ చంద్రశేఖర్... జిందాబాద్.'

'దేశభక్త చంద్రశేఖర్... జిందాబాద్.'

నినాదాలు మోగుతున్నాయి.

'ఆహా! ఏమా ఠీవి. ఏమా హుందాతనం!"

'ఆయన గారికి చేతులెత్తి మొక్కాలనిపిస్తుందన్నా!'

నలుగురు నాగరికులు అటే చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

'గసొంటోళ్ళను చూస్తే కడుపునిండి పోతదన్నా!'

'అవనుగదా! దేశాన్ని దేశ ప్రజల్ని కంటికి రెప్పలా కాపాడే దేశభక్తుల ముందు నా తల వంగి పోతుందండోయ్!"

'అబ్బే! అలాంటోళ్ళు ఉన్నారు. కాబట్టే మనలాంటోళ్ళు గుండెలమీద చెయ్యేసుకుని బతుకుతున్నారు. ఆ మహానుభావునిదే ఊరో.. ఎంత పుణ్యాత్ముడో...

శారదలో అనిర్వచనీయమైన ఆనందం. అనుకోకుండా చంద్రశేఖర్ కెదురెళ్ళి చేతులు జోడించింది.

'బాగున్నావా శారదా!' మేజర్ చంద్రశేఖర్ అప్యాయంగా అడిగాడు.

'శేఖర్! నువ్వు రిటైర్డ్.. బట నాట్ టైరెడ్' పెదాల మీద సన్నని చిరునవ్వు.

'థాంక్యూ శారదా! నీ భర్త కొడుకూ కూతురూ...."

'అంతా.. ఓకే..." ఆమాట గుండెల్లోంచి రాలేదు.

'వాళ్ళకేమండీ!" భవాని శారద చెయ్యందుకుంది.

"మీ బాల్య స్నేహితురాలి భర్త కోటీశ్వరుడు. కొడుకు ప్రయోజకుడై నాడటా.. కూతురు ఎమ్మేపాసైంది.

'వెరీగుడ్.. మా ఏకైక పుత్రుడు ఎయిర్ ఫోర్స్‌లో ఆఫీసరైపోయిండు శారదా!" చంద్రశేఖర్. సగర్వంగా చెబుతున్నాడు.

'అంటీ.... బాగున్నారా?' వెంట నడుస్తున్న శ్రీవాణి పలుకరించింది.

'పైవాడి దయవల్ల అంతా బాగున్నారమ్మా' భవాని చెయ్యి శ్రీవాణి వీపు నిమిరింది' అన్నట్టూ ... మీ అన్నయ్య అమెరికాలోనే ఉన్నాడా?"

'ఈరోజే... ఆమెరికా నుండి వస్తున్నాడు. నాన్నగారు. తీసుకొస్తున్నారు. కొద్ది సేపట్లో ఫ్లైటుదిగుతారు.'

'ఓహో! వాళ్ళను రిసీవ్ చేసుకునేందుకు వచ్చారా?' అర్థవంతంగా అనేసింది భవాని.

శారద గుండెలో గులకరాయి దొర్లినట్టనిపించింది.

బయట... యువత... ఆనందోత్సహాల కోలాహలం. వందలాది యువతీ యువకులు చంద్రశేఖర్‌కు జైకొడుకూ పూలదండలతో ముంచెత్తుతున్నారు. అందంగా అలంకరించిన జీపులో.. బాజాభజంత్రీలతో తీసుకెళ్తున్నారు.

శారద వెనక్కు తిరిగి వెయిటింగ్ రూంకొచ్చింది.

'వాషింగ్టన్ ఫ్లయిట్ ఎప్పుడు వస్తుందో కనుక్కొస్తానమ్మా....' అంటూ శ్రీవాణి అటు వెళ్ళింది.

శేఖర్... చంద్రశేఖర్! మేజర్ చంద్రశేఖర్! భవాని అదృష్టవంతురాలు. ఆ భాగ్యం అందరికీ రమ్మంటే వస్తుందా!.. మనసు మూల్గుల్ని వింటూ కుర్చీలో కూచుండిపోయింది శారద. మనిషి విమానాశ్రయంలో కూచున్నా మనసు.... తెగిన గాలిపటంలా పరుగెత్తుతోంది. ఉరకలు పరుగుల్లో ముప్పై సంవత్సరాల వెనక్కు వెళ్ళి చింతమడ్కలో చెట్టు చిటారు కొమ్మకు తగులుకుంది.

చింతమడ్క.. పల్లెటూరు. ప్రకృతి ఒడిలో పచ్చని పొలాలు గళాలను తడిపే చెరువు నీరు. నీటి అలల మీద ఉయ్యాల లూగుతున్న కలువ కన్నెలు.. చుట్టూ అడవి మధ్యలో ఊరు. ఊరు నడిబొడ్డున రాజరాజేశ్వరాలయం. ఆలయం. చుట్టూ పొన్న, పొగడ, కనకాంబరాల చెట్లు... కొమ్మలు, రెమ్మలు.... మల్లె తీగలు గాలి కబుర్లు

వింటూ గమ్మత్తుగా తలలూపుతూ పూలవాన కురిపిస్తున్నాయి. పూలవానకు పిల్లగాలి తోడై మోహన మురళీగాన లహరులు వీస్తున్నాయి. పూలవానలో పరవశిస్తూ, గానామృతంలో తడిసిన శారద... కుందనపుబ్బొమ్మ శారద... ఇంటర్‌తో చదువు ఆపేసిన. కళ్ళల్లో... కాంతిరేఖలు తళుక్కుమన్నాయి. దానిక్కారణం...

చిన్నప్పుడు చెట్టాపట్టాలేసుకుని గుడిలో, బడిలో ఆడుకున్న బాల్య స్నేహితుడు మందహాసంతో మధుర భాషణతో తన మానసవీణ మీద రాగాలు పలికించిన నవ యువకుడు... ఈ మధ్య చదువు ధ్యాసలో, ఉద్యోగాన్వేషణలో... తనతో మనసు విప్పి మాట్లాడని మానస చోరుడు... డిగ్రీ పాసై ఉద్యోగంలో చేరబోతున్న చంద్రశేఖర్ వచ్చి... ఎదురుగా నుంచున్నాడు. ఎదనిండా ఉత్సాహం... ఉల్లాసం... నేలమీది పూలను దోసిలితో ఎత్తి అతనిమీద కుమ్మరించింది. నల్లని మీసంకట్టు కింద తెల్లని చిరునవ్వు... అటు గర్భగుడిలో రాజరాజేశ్వరుని క్షీరాభిషేకం, ఇటు తోటలో చంద్రశేఖరుని పుష్పాభిషేకం... అద్భుతం!

'థాంక్యూ శారదా!' అలవోకగా చేతులందుకుని చెంపలకు రాసుకున్నాడు. వేళ్ళను వేళ్ళు నిమురుతున్నాయి. ఆనందం అధికమై నరాల్లో జరజరా పాకింది. గుండెలు పాల సముద్రతరంగాల్లా ఉప్పొంగినై.

'శేఖర్.... చంద్రశేఖర్!' గాజుల చేతులు గాఢంగా పెనవేసుకు పోయినై... 'నీకుద్యోగ మొచ్చిందటగదా!' బుగ్గలమీద సిగ్గుల మొగ్గలు.

'అవును శారదా! మిల్ట్రీ ఆఫీసరునై పోతున్నాను. రేపే ట్రెయినింగ్‌కు బయల్దేరాలి" శేఖర్ చేతులు తన నడుముకు ఒడ్డాణమైపోతున్నాయి.

'నువ్వదృష్టవంతుడివి శేఖర్. దేశ సరిహద్దుల్ని రక్షించే సదవకాశం అందరికీ దొరుకుతుందా?" గుండెలు స్పర్శించు కుంటున్నాయి.

'దేవుని దయ వల్ల నేను కోరుకున్న ఉద్యోగం దొరికింది. కన్న నేలను కంటికి రెప్పలా భావించే భాగ్యం లభించింది.'

'ఇది భావోద్వేగమా?'

'కాదు. భాషకందని అంతర్వాహిని శారదా!' ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఒరుసుకుంటు న్నాయి.

ఆత్మీయం, అనురాగం, తన్మయత్వం.. అలా ఎంత సేపున్నారో!

గుడిగంటలు గణగణ మోగినై. రాజరాజేశ్వరునికి హారతులిస్తున్నారు. వేదమంత్రాలు... నాదస్వరాలు.

'ఎవరూ... ఎవరా చెట్టుకింద?' శారద తండ్రిగొంతు ఖంగుమంది. గుండెల్లో కురుస్తున్న పూలవాన,... గానలహరి స్తంభిచిపోయినై. ఠక్కున విడిపోయారు.

'నమస్తే అంకుల్! నాకుద్యోగం.. మిల్ట్రీ ఉద్యోగం దొరికింది. రేపే ట్రయినింకెల్తున్నా' చంద్రశేఖర్ చొరవ.

శుభం ! చాలా సంతోషం శేఖర్. ఉద్యోగం దొరికింది గదా! ఇంకా వెంటనే పెళ్ళి చేయమని మీ నాన్నకు చెప్తా. అన్నట్టూ.. త్వరలోనే మా శారద పెళ్ళి నువ్వు తప్పక రావాలి. సుమా!'

'వరుడెవరు అంకుల్?'

'ఓ కోటీశ్వరుని కొడుకు. తరతరాలుగా కూచుండి. తిన్నా తరగని ఆస్తిపాస్తులు.'

'అలాగా!?' చంద్రశేఖర్ మొహం... బహువర్ణ చిత్రమైంది.

నాకు పెళ్ళా... నా ఇష్టాయిష్టాలతో పనిలేదా!

'ఓ దేశ భక్తుడితో జీవితం పంచుకునే అదృష్టం కల్పించండి నాన్నా!' అని అడగాలనుకుంది కాని... ఆ మాటలను నాన్న వాలకం గొంతులోనే నులిమేసింది.

కులగోత్రాలు, ఆస్తులు, అంతస్తులు.... ఈ సమాజాన్నింకా శాసిస్తున్నాయి.. గదూ!... అనాటి ఆత్మఘోష నేడు వినబడుతోంది.

'అమ్మా! నాన్న గారొస్తున్న ఫ్లయిట్ దిగుతుందే!" శ్రీవాణి పరుగెత్తుకొచ్చి చెయ్యిబట్టి లాగింది. వర్తమానం గుర్తు కొచ్చింది.

'అలాగా!....' లేచినుంచుంది.

'అవునమ్మా! మన వాళ్ళకు మనమే ముందు కన్పించాలి.'

బయట... త్యాగధనుని స్వాగత సత్కారాలు... నినాదాలు ఇంకా చెవుల్లో గింగురుమంటున్నాయి.

భవాని... ఏ జన్మలో... ఏ నోము నోచిందో!....

'పదమ్మా వెళ్దాం!' శ్రీవాణి గొంతులో అత్యుత్సాహం.

'సరే... పదా!'

విమానం పక్షిలా నేలకు దిందిి. అందులోంచి దిగుతున్న వాళ్ళంతా చేతులూపుతు న్నారు. రమేష్. నాగరాజులు ఏదో మాట్లాడుకుంటూ దిగుతున్నారు. శ్రీవాణి చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది. ఇమిగ్రేషన్ వగైరాలు పూర్తి చేసుకుని తండ్రీ కొడుకులు బయటికొస్తు న్నారు.

నలుగురు వ్యాపార మిత్రులు గబగబా ఎదురెళ్ళారు. పోటీలుపడిపూలదండ లేశారు. కరచాలనం చేస్తూ కమ్మగా పలుకురిస్తున్నారు. చిరునవ్వుల సిరులు కురి స్తున్నారు.

'వెల్కం! రమేష్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు కాబోయే అధిపతి నాగరాజు గారికి హార్టీ వెల్కం.'

'కోటీశ్వరులు నాగరాజు గారికి స్వాగతం. సుస్వాగతం!'

'మిమ్మల్నిట్లా రిసీవ్ చేసుకోవడం... మా అదృష్టమన్నా!'

'మీ కొత్త ప్రాజెక్టు కోటిలాభాలార్జించాలని కోరుకుంటున్నాము సామీ!'

పెదాల మీది ప్రేమ. అడుగులో అడుతేస్తూ పొగడ్తలు. కృత్రిమం, అదంతా కృత్రిమం. అది అందరికీ తెలుసు.

'అమ్మా...!' నాగరాజు దూసుకొచ్చి తల్లి ఒడిలో వాలాడు.

పుత్ర వాత్సల్యంతో శారద గుండెలుప్పొంగినై. 'బాబూ!" బాగున్నావా!' తల నిమిరి నుదురు ముద్దాడింది. వాడిపోయిన వంకాయలాగున్న మొహం అరవిరిసిన గులాబి అయింది.

'నాన్నా! ప్రయాణం బాగా సాగిందా?" శ్రీవాణి తండ్రి గుండెలమీద వాలింది రమేష్ నవ్వేశాడు. కూతురు తలనిమురుతూ. 'బాగానే సాగిందమ్మా! మీ అమ్మ ఏమంటుందీ? త్వరగా మీకు పెళ్ళిళ్ళు చేసి తీర్థయాత్రల కెల్తానంటుందా?' అంటూ శారద కళ్ళల్లోకి చూడాలని ప్రయత్నించాడు. తల్లీ కొడుకులు తన్మయత్వం అందుకంగీకరించలేదు.

అన్నా. చెల్లెలు ముందు సీట్లో, భార్యభర్తలు వెనకఫీట్లో... కారు కదిలింది.

పెంటాగన్ మీద తీవ్రవాదుల దాడి, నయాగరా సోయగాలు... అమెరికా వింతలు విశేషాలు నాగరాజు చెబుతూంటే శ్రీవాణి ఆసక్తిగా వింటోంది. యూనివర్సిటీలో కాన్వొకేషన్, క్లాసుమేట్స్ జోకులు అన్నయ్యకు వినిపించాలని ఉవ్విళ్ళూరుతూంది.

ఎంత విచిత్రమీ జీవితం! ఆస్తిపాస్తులకు కొదవలేదు. ఏదంటే అది క్షణాల్లో సమకూర్చే భర్త... ముత్యాల్లాంటి పిల్లలు.. ఆధునికతంతా సొంతం. చేసుకున్న మూడంతస్తుల అందాల మేడలో నివాసం. అన్నీ ఉన్నాయి. కాని అవన్నీ స్వసుఖాలకోసమే. కేవలం మా కోసమే. వాటివల్ల దేశానికేం ప్రయోజనం? అవి సమాజానికేమి మేలు చేస్తున్నాయి?... శారద ఎదపొదలో అలజడి తీవ్రమైంది.

జీవితమంటే ఇంతేనా? ఊహుం! కాదు. ఇంకేదో ఉన్నది. చతుర్విధ పురుషార్థాలంటే... ఇంతేనా? కాదు.

కొడుకు వైపు గర్వంగా చూస్తున్న రమేష్ శారద చెవిలో చెబుతున్నాడు. 'నా ఆలోచనల కనుగుణంగా మన నాగరాజుకు వ్యాపార శాస్త్రమంతా అవగతమైంది. వాని ఊహల వ్యూహాలన్నీ వ్యాపారాభివృద్ధి. లాభాల మీదనే... వాని హయాంలో మన ఆస్తిపాస్తులు కొన్ని రెట్లు పెరగడం ఖాయం శారదా!' ఇటు తిరిగి శారద భుజాలు పొదివి పట్టుకున్నాడు. 'అన్నట్టూ.... అమెరికాలో స్థిరపడిన కోటీశ్వరుని కూతురు మనకు కోడలుగా రాబోతుంది. ఆ అమ్మాయి కంప్యూటర్ ఎక్స్‌పర్ట్. మన వాడికి కుడి భుజంగా ఉంటుంది. సుమా!...." చెబుతూనే పోతున్నాడు.

ఎగిరి గంతులేస్తుందనుకున్న శారదలో స్పందన లేదు.

'ఏమిటి శారూ!' గారాంబంగా గదవబట్టి తన వైపుకు తిప్పుకున్నాడు.

శారద కళ్ళల్లో సన్నని మంచుతెరలు.

'అదేమిటి శారశా!' ఖంగుతున్నాడు. 'మనబాబు బిజినెస్ మాగ్నెటై తిరిగొస్తున్నాడు. బాధ్యతలన్నీ వాని కప్పగించి నేను రిటైర్ కాబోతున్నాను. ఇహ మన శేషజీవితం సుఖంగా సంతోషంగా తీర్థయాత్రలతో గడిచిపోతుంది. వాళ్ళ పెళ్ళిళ్ళు చేసేసి మనం నిశ్చింతగా ఉండొచ్చు....' చక్కిలిగింతలు పెట్టాడు.

శారద పెదాలు మెల్లగా కదిలినై. బలవంతంగానైనా నవ్వుదామను కుంది. కాని... కాని ఏడుపొస్తుంది. బాధనంతా లోలోపలే అదిమిపెట్టి మొండి ధైర్యం తెచ్చి పెట్టుకుంది.

'ఎంత సంపాదించినా. ఆస్తిపాస్తులెన్ని రెట్లు పెరిగినా చిన్నారి నా పొట్ట శ్రీరామరక్షనే గాని పరోపకారం గురించి పల్లెత్తు ఆలోచన లేదు. జన్మనిచ్చి పెంచి

పోషించిన జన్మభూమి కోసం... మన దేశంకోసం... మనలనీ స్థాయికి పెంచిన సామాన్య ప్రజలకోసం మనమేం చేస్తున్నామండీ?' సూటిగా, నిర్మొహమాటంగా అడిగింది.

అడుగుడు కాదది కడుగుడు లాగనిపించింది.

కోట్లకి.. పడగలెత్తిన రమేష్... ఒంటినిండా గర్వం. బుసలుకొడుతున్న రమేష్ బుర్ర గిర్రుమంది. బుర్ర గిర్రుల్లో భూగోళం బద్దలై పోతోంది. మేరు పర్వతమంత ఎదిగాననుకున్న తాను.. గులక రాయిగా మారిపోయాడు.

విమానాశ్రయంలో మేజర్ చంద్రశేఖర్ స్వాగత సత్కారాల గురించి అతని త్యాగల గురించి శ్రీవాణి చెబుతుంటే నాగరాజు శ్రద్ధగా వింటున్నాడు.

'మేజర్ చంద్రశేఖర్ అంకుల్ రిటైరైనాడు. మన నాన్న గూడా రిటైరవుతున్నాడు. వీళ్ళిద్దరి గురించి జనాల స్పందన వేరుగా ఉంది. గదరా అన్నయ్యా! ఆయనను త్యాగధనుడంటున్నారు. మన నాన్నను భోగజీవి అంటున్నారు."

నాగరాజు నరాల్లో కొత్త రకం స్పందన

కారులో అమర్చిన టీ.వీ బుల్లి తెరమీద బిల్‌గెట్స్ సేవా కార్యక్రమాల దృశ్యాలు కనబడుతున్నాయి.

కారు మూడంతస్తుల మోడ్రన్ బిల్డింగ్ ముందాగింది.

తండ్రీ కొడుకుల మనోనేత్రాలు తమ గుండె ఇరుకుల్ని కొలుచుకుంటు న్నాయి. అర్థము, పరమార్థమేమిటని ప్రశ్నించుకుంటున్నాయి.

గెలుపు - మార్చి 2003

❖ ❖ ❖ ❖ ❖

కథా నిలయం
శ్రీకాకుళం